
సాక్షి గుంటూరు

శనివారం, 1, జూన్, 2024



నాగవల్లీ దళార్చన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయ గుడిలో హనుమజ్జయంతి సందర్భంగా శుక్రవారం లక్ష నాగవల్లీ దళార్చన వైభవంగా చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

హనుమాన్‌కు ఫల, పుష్పాలంకరణ



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు, హనుమత్ హోమం, విశేష ఫల పుష్పాలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

ఢిల్లీ ఎయిమ్స్ ఫలితాల్లో డాక్టర్ వినీతకు ఫస్ట్ ర్యాంకు



గుంటూరు మెడికల్: ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) న్యూఢిల్లీ వారు సూపర్ స్పెషాలిటీ పీజీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష రుమటాలజీ విభాగంలో డాక్టర్ కన్నెగంటి వినీత జాతీయ స్థాయి మొదటి ర్యాంకు సాధించారు. డాక్టర్ వినీత ఎయిమ్స్‌లోనే ఎంబీబీఎస్ పూర్తి చేసి జనరల్ మెడిసిన్ పీజీని చండీగఢ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో పూర్తి చేశారు.

గురుకుల మైనార్టీ పాఠశాలల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఎస్) ఆధ్వర్యంలో పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని మైనార్టీ బాలుర, పొన్నూరు రోడ్డులోని మైనార్టీ బాలికల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ జె.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12లోపు ఆయా పాఠశాలలకు నేరుగా వచ్చి దరఖాస్తు సమర్పించి, ప్రవేశం పొందాలని సూచించారు. వివరాలకు 87126 25039, 63020 18886 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 246 మంది



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం 246 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. కాగా శనివారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 75,001 నుంచి 92 వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

'బంగారు' చంద్రిక

పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ



మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ మెన్, ఉమెన్ బెంచ్ ప్రెస్–2024 పోటీలు శుక్రవారం ముగిశాయి. మహిళా విభాగంలో పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక రెండు బంగారు పతకాలను సాధించింది. 560 కేజీల విభాగంలో స్కాట్ 252.5 కేజీలు, బెంచ్ ప్రెస్ 107.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 200 కేజీల విభాగాలలో రెండు బంగారు పతకాలు సాధించిన చంద్రికను అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరావు, షేక్ సంధాని, సకల కోటేశ్వరరావు, ఎన్.సి.మోహన్, మద్దె ప్రభాకర్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) పదవ తరగతి, ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు నాలుగు పరీక్ష కేంద్రాలలో 941 మంది విద్యార్థులు, ఆరు పరీక్ష కేంద్రాలలో 1,279 మంది ఇంటర్మీడియేట్ విద్యార్థులు హాజరు కానున్నట్టు వివరించారు. రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ అధ్యయన కేంద్రాలలో హాల్‌టికెట్లను తీసుకొని పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి ముందే కేంద్రానికి చేరుకోవాలని, మధ్యాహ్నం 2.30 గంటల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించటం జరగదని స్పష్టం చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తమ పరిధిలోని పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని డీఈఓ ఆదేశించారు.



గుంటూరులోని పిచ్చుకులగుంటలో ఆంధ్ర క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

అవకాశాలు ఇన్‌క్రీజు

- గుంటూరులో క్రికెట్ శిక్షణ
- ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్న ఏసీఏ
- బీసీసీఐ లెవల్–1 కోచ్‌లతో తర్ఫీదు
- ఉచితంగా వేసవి శిక్షణ శిబిరం
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రపంచవ్యాప్తంగా యమ క్రేజ్ ఉన్న క్రీడ క్రికెట్. మన దేశంలో అయితే అదో ఫీవర్. ఐపీఎల్ లాంటి సీజన్స్ రాకతో ఈ ఆటకు అభిమానులు పెరిగిపోయారు. చిన్నారులైతే ఎప్పుడెప్పుడు క్రికెట్ బ్యాట్‌తో గ్రౌండ్‌కి వెళదామా అని ఆశ పడుతుంటారు. చాలా మంది ప్రతిభ ఉన్నా.. సరైన శిక్షణ అవకాశాల్లేక గల్లీ క్రికెట్‌కు పరిమితమైపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు మైదానాలకు తీసుకొచ్చి పిల్లలకు ఇష్టమైన క్రికెట్‌లో శిక్షణనిప్పిస్తున్నారు. ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరాలు క్రికెట్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులకు వరంగా మారాయి. దీనిని గమనించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శరత్ చంద్రారెడ్డి, గోపీనాథ్ రెడ్డి జిల్లా క్రికెట్ సంఘం సారథ్యంలో గుంటూరు అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఇక్కడ అత్యాధునిక సదుపాయాలతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం వంద మంది చిన్నారులు ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. వేసవి శిక్షణతోపాటు రెగ్యులర్ శిక్షణ కూడా ఇక్కడ ఉచితంగా అందుబాటులో ఉంది. ఇప్పటికే ఇక్కడ ఓనమాలు నేర్చుకుని రంజీ ట్రోఫీ వరకు వెళ్ళిన క్రికెటర్లు చాలా మంది ఉన్నారని నిర్వాహకులు చెబుతున్నారు. బాలికలకూ ప్రత్యేక శిక్షణనిస్తుండడం గమనార్హం.



శిక్షణలో ప్రసర్‌మీ (బౌలర్)



శ్రీనివాస్‌రెడ్డి (బౌలర్)



వికెట్ కీపింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న అజయ్

అన్ని వసతులతో..

అన్ని అత్యాధునిక వసతులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగే టర్ఫ్ వికెట్స్ సుమారు అరడజను ఉన్నాయి. బీసీసీఐ లెవెల్–1 కోచ్‌లు శిక్షణనిస్తున్నారు. చిన్నారులు, యువ క్రికెటర్ల కోసం ఆధునిక జిమ్‌తో పాటు క్రీడాకారులు తమ కిట్స్‌ను భద్రపరుచుకునేందుకు ప్రత్యేక రూమ్ అందుబాటులో ఉన్నాయి. మైదానం నిత్యం తడిపేందుకు రూ.13 లక్షలతో స్ప్రింక్లర్స్ ఇటీవలే కొనుగోలు చేశారు. ఇటీవల కాలంలో నలుగురు రంజీ ప్లేయర్లు (రషీద్, మహీప్, వంశీ కృష్ణ, ఎస్.అఖిల్) వెలుగులోకి వచ్చారు. వీరిలో కొందరు ఐపీఎల్‌లో ఆడారు. పెద్దపెద్ద నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌పీ రమణ మూర్తి, దాసరి రమేష్ కుమార్ మైదానాన్ని, శిక్షణ వసతులను తీర్చిదిద్దుతున్నారు.



శిక్షణలో బ్యాటింగ్ చేస్తున్న ప్రమోద్

ఉమెన్ క్రికెట్‌లో పోటీ తక్కువ



మా ఇంట్లో అందరికీ క్రికెట్ అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా నేను క్రికెట్ నేర్చుకుంటానంటే నాన్న ఒప్పుకున్నారు. అందుకే రెగ్యులర్‌గా బౌలింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. నాలాగా చాలా మంది అమ్మాయిలు సాధన చేస్తున్నారు. నాకు మంచి స్నేహితులు కూడా దొరికారు. కోచ్‌లు చాలా ఫ్రెండ్లీగా ఉంటారు.

– శ్రావ్య, (బౌలర్)

శిక్షణ చాలా బాగుంది



ఇక్కడ అంతా ఒక షెడ్యూల్ ప్రకారం జరుగుతోంది. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఫిట్‌నెస్‌తోపాటు ఫీల్డింగ్, నా కిష్టమైన ఫాస్ట్ బౌలింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. మా కోచ్ కూడా గతంలో రంజీ ఫాస్ట్ బౌలర్. నాకు చాలా ఉపయోగంగా ఉంది. పూర్తిగా ఫ్రీ కోచింగ్. తర్వాత కూడా శిక్షణ కొనసాగిస్తాను.

– శ్రీనివాసరెడ్డి, (బౌలర్)

రాజీ లేకుండా ఏర్పాట్లు





ఇక్కడ ఓనమాలు దిద్దుకునే చిన్నారులు రంజీతో పాటు, దేశానికి ప్రాతినిధ్యం వహించేలా ఆధునిక శిక్షణ, వసతులు కల్పించాం. ఏసీఏ పెద్దలు కూడా మాకు ఎంతో సహకారం అందిస్తున్నారు. అందుకే తక్కువ కాలంలోనే నలుగురు రంజీ ట్రోఫీకి, డజన్ల కొద్దీ మంది రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా రాణించారు. బీసీసీఐ లెవెల్–1 కోచ్‌ల సారథ్యంలో చిన్నారులు శిక్షణ తీసుకుంటున్నారు. రాజీలేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎంఎస్‌పీ రమణ మూర్తి, దాసరి రమేష్ కుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై మార్గదర్శకాలను జారీ చేసిందని వివరించారు. లెక్కింపు విధుల కోసం అదనపు సిబ్బందిని కేటాయించారని వెల్లడించారు. వీరంతా కౌంటింగ్ విధానంలో పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అదనపు సిబ్బంది అత్యంత జాగ్రత్తగా పనిచేయాలన్నారు. మరోసారి పోస్టల్ బ్యాలెట్‌పై శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, గుంటూరు పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి భీమారావు, ఐటీ నోడల్ అధికారి రఘు, అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

టెన్త్ సోషల్ పాఠాలకు సరికొత్త పుస్తకాలు

- సాంఘిక శాస్త్రాన్ని నాలుగు భాగాలుగా విభజించిన ఎస్సీఈఆర్టీ
- సీబీఎస్ఈ తరహాలో నాలుగు పాఠ్య పుస్తకాలుగా రూపకల్పన
- సామాజిక శాస్త్రాలపై అధ్యయనం పెంచే దిశగా ప్రభుత్వ చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: 10వ తరగతి పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరికొత్తగా మార్చింది. గతేడాది వరకు ఒకే పాఠ్య పుస్తకంగా ఉన్న సాంఘిక శాస్త్రాన్ని రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) నాలుగు భాగాలుగా విభజించింది. సీబీఎస్ఈ తరహాలో పాఠ్యాంశాలను విభజించి, సరికొత్తగా ముద్రణ చేసింది. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు విద్యాకానుక ద్వారా ఉచితంగా అందించనున్న పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. సాంఘిక శాస్త్రాన్ని నాలుగు భాగాలుగా విభజించిన ఎస్సీఈఆర్టీ వాటిని జాగ్రఫీ, ఎకనామిక్స్, చరిత్ర, డెమోక్రటిక్ పాలిటిక్స్ రూపంలో ముద్రించింది. ప్రస్తుత చదువుల్లో ఇంజినీరింగ్, మెడికల్ కోర్సులు మినహా సామాజిక శాస్త్రాల అధ్యయనంలో వెనుకబడిపోతున్న విద్యార్థులకు వాటిలోని గొప్పతనాన్ని తెలియజేసే విధంగా సాంఘిక శాస్త్రాన్ని సరికొత్తగా, విద్యార్థులు ఆసక్తి కనబర్చే విధంగా తీర్చిదిద్దింది. అదే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యాసంస్కరణల్లో భాగంగా పాఠ్య పుస్తకాలను బైలింగ్వల్ తరహాలో టెన్త్ పాఠ్య పుస్తకంలోని పాఠ్యాంశాలను మిర్రర్ ఇమేజింగ్ టెక్నాలజీతో ఒకవైపు తెలుగులో, మరో వైపు ఇంగ్లిష్ భాషలో ముద్రించారు.



మిర్రర్ ఇమేజింగ్ టెక్నాలజీతో ముద్రించిన బైలింగ్వల్ పాఠ్యాంశాలు

'ఏజెంట్' అక్రమం

- ఓటమి భయంతో లోకేష్ అడ్డదారులు
- స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్ల కొనుగోలుకు టీడీపీ కుయుక్తులు

మంగళగిరి: మంగళగిరిలో ఒకసారి ఓడిపోయి రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న టీడీపీ అభ్యర్థి నారా లోకేష్ గెలుపు కోసం ఆపసోపాలు పడుతున్నారు. పోలింగ్ సరళిని బట్టి రెండోసారీ ఓటమి తప్పదని ఓ అంచనాకు వచ్చిన పచ్చపార్టీ నేతలు అడ్డదారులు తొక్కయినా ఈసారి లోకేష్‌ను గట్టెక్కించాలని వ్యూహాలు పన్నుతున్నట్టు తెలిసింది. ఎన్నికలు జరిగే రోజు వరకు అలవోకగా గెలుస్తామని బీరాలు పలికిన టీడీపీ నాయకులు పోలింగ్ సరళితో డీలాపడ్డారు. ఎలాగైనా లోకేష్‌ను గెలిపించాలని చంద్రబాబు నుంచి ఆదేశాలు రావడంతో కౌంటింగ్ ఏజెంట్ల కొనుగోలుపై దృష్టి సారించారు.

స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లకు వల

ఈసారి ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో 40 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఒక్కో అభ్యర్థి 18 మంది కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. 14 టేబుళ్లకు 14 మంది, పోస్టల్ బ్యాలెట్‌కు నలుగురు ఏజంట్లను నియమించుకోవచ్చు. దీంతో కొందరు స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్ల స్థానంలో టీడీపీ అనుచరులను ఏజెంట్లుగా నియమించుకుని తమకు అనుకూలంగా ఉండేలా చూసుకునేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. దీనికోసం ఒక్కో ఏజెంట్‌కు రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు చెల్లిస్తామని బేరసారాలు సాగిస్తున్నట్టు తెలిసింది.

ఎయిడెడ్‌కు బంపర్ ఆఫర్

- ఇంగ్లిష్ మీడియంలోకి మారేందుకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- తెలుగు మాధ్యమంలో ప్రవేశాలు లేక ఎయిడెడ్ బడులు వెలవెల
- ఇంగ్లిష్ మీడియం లేకపోవడంతో ప్రైవేటు స్కూళ్ల బాట పడుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ నిర్ణయంతో ఎయిడెడ్‌కు మహర్దశ
- గుంటూరు జిల్లాలో 92 ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న 11,090 మంది విద్యార్థులకు ప్రయోజనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిడెడ్ పాఠశాలల దశ, దిశ మార్చేందుకు ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దశాబ్దాల తరబడి ఎదుగుదల లేక కునారిల్లుతున్న ఎయిడెడ్ పాఠశాలలు ఈ విధానంతో ప్రగతి బాట పట్టనున్నాయి. ఎయిడెడ్ పాఠశాలల్లో బోధనను ఇంగ్లిష్ మీడియంలోకి మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ఇటీవల జీవో నంబరు 16 విడుదల చేసింది. మాధ్యమాన్ని మార్చుకునేందుకు ముందుకు వచ్చే పాఠశాలలకు 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఇది వర్తించనుంది. గుంటూరు జిల్లాలో 92 ఎయిడెడ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా, వాటిలో 11,090 మంది విద్యార్థులు చదువుతున్నారు. దశాబ్దాల క్రితం స్థాపించిన ఎయిడెడ్ పాఠశాలలు సంస్కృత, తెలుగు మాధ్యమాల బోధనకే పరిమితం కావడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తరిగిపోతూ వస్తోంది. ఐదేళ్ల క్రితం వరకు ప్రభుత్వ పాఠశాలలూ ఎయిడెడ్ పాఠశాలలతో సమానంగా వసతుల లేమితో కొట్టుమిట్టాడాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దిన ఫలితంగా గత నాలుగేళ్లుగా వాటిల్లో విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. ఇంగ్లిషు మీడియం చదువుల కోసం ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోవడంతో ఎయిడెడ్ పాఠశాలల్లో పిల్లలు కానరావడంలేదు. ఈ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుండగా, నానాటికీ విద్యార్థుల సంఖ్య పడిపోతుండటంతో పాఠశాలల నిర్వహణ యాజమాన్యాలకు కష్టతరంగా మారుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎయిడెడ్ పాఠశాలలు పూర్వ వైభవాన్ని పొందవచ్చు. ఎయిడెడ్ పాఠశాలలు ఇంగ్లిషు మీడియం బోధనతో విద్యార్థుల ప్రవేశాలను పెంచుకునేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.



గుంటూరులోని ఓ ఎయిడెడ్ పాఠశాల

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎయిడెడ్ పాఠశాలలు ఇంగ్లిషు మీడియంలోకి మారేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గుంటూరు జోన్ పరిధిలో బోధన మాధ్యమాన్ని ఆంగ్లంలోకి మార్చుకునేందుకు సుముఖంగా ఉన్న పాఠశాలల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలని డీఈఓలకు, డీవైఈఓలకు ఆదేశాలు ఇచ్చాం.

బి.లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ ఆర్జేడీ

పొగాకు రహిత సమాజం కోసం సిబార్ కృషి ప్రశంసనీయం



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, తదితరులు

పెదకాకాని: పొగాకు రహిత సమాజం కోసం సిబార్ దంత వైద్య కళాశాల చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ పొగాకు రహిత సమాజానికి కృషి చేస్తున్న సిబార్ దంతవైద్య కళాశాలను అభినందించారు. తర్వాత సిబార్ దంత కళాశాల వైద్యులు డాక్టర్ పి.శ్రీనివాస్, కిరణ్ కుమార్, లలిత్ ప్రకాష్ చంద్ర, ఆషా తదితరులు పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పత్తి విత్తనాలు విక్రయం

- అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు
- గుంటూరు అర్బన్ ఏఓలు అంజిరెడ్డి, కిషోర్

కొరిటెపాడు(గుంటూరు): కొన్ని రకాల బీటీ పత్తి విత్తనాల సరఫరా తక్కువగా ఉండటం, మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని స్వయంగా వ్యవసాయ శాఖ విత్తన విక్రయాలకు శ్రీకారం చుట్టిందని గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు బి.అంజిరెడ్డి, బి.కిషోర్ తెలిపారు. స్థానిక రాజాగారితోటలో రైతుల పాసుపుస్తకాల ఆధారంగా విత్తన పంపిణీకి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏఓలు అంజిరెడ్డి, కిషోర్ మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ కంపెనీకి చెందిన సూపర్ బన్ని రకం విత్తనాలకు మార్కెట్‌లో కొరత ఉందని, దీంతో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో కొన్ని రకాల బీటీ విత్తనాలను స్వాధీనం చేసుకొని రైతులకు ఎమ్మార్పీ ధరకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. గుంటూరు అర్బన్‌కు సూపర్ బన్ని పత్తి విత్తనాలు 1,530 ప్యాకెట్లు కేటాయించామని, వాటిని నగరంలోని 17 విత్తన షాపులకు సరఫరా చేశామని వెల్లడించారు. ఆ ప్యాకెట్లను రైతు పాసుపుస్తకం ఆధారంగా ఒక్కో పాసుపుస్తకానికి కనిష్టంగా రెండు ప్యాకెట్లు, గరిష్టంగా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. వ్యవసాయ అధికారుల సమాచారం, ఆదేశాలు లేకుండా ఒక్క ప్యాకెట్ కూడా షాపుల వారు విక్రయించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయించినా, నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో రైతులకు పూర్తి వివరాలతో కూడిన ఒరిజినల్ బిల్లులు, ధరల పట్టిక ఉండాలని ఆదేశించారు. ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేపట్టినా, నిబంధనలకు విరుద్ధంగా కల్తీ, నాసిరకం, నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలు సాగించినా క్రిమినల్ కేసులతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని అల్టిమేటం జారీ చేశారు. ఇష్టారాజ్యంగా పురుగు మందులు అంటగట్టడం, కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక ధరలు, బిల్లులు లేకుండా అమ్మడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శివాజీ, వీఏఏ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పత్తి విత్తన ప్యాకెట్లు అందజేస్తున్న ఏఓలు అంజిరెడ్డి, కిషోర్, ఏఈఓ శివాజీ

క్లుప్తంగా

యూనియన్ బ్యాంకు విదేశీ విద్యా రుణాలు



రుణ పత్రాలు అందుకున్న విద్యార్థులతో యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది

కొరిటిపాడు: గుంటూరు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు విదేశీ విద్యా రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ ఎస్.జవర్ మాట్లాడుతూ రూ. 40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ అవసరం లేకుండా విదేశీ విద్యా రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వారికి యూనియన్ బ్యాంకు ఎల్లప్పుడూ సహకారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్ హెడ్‌లు అశ్వర్ధనాయక్, ఎ.రాజేష్, రిటైల్ రుణ పాయింట్ హెడ్ జె.రామాంజనేయకుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అతి తక్కువ వడ్డీ రేటుతో సకాలంలో రుణం మంజూరు చేసినందుకు బ్యాంకు ప్రతినిధులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరు విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

మగధీరులు వెనకడుగు!

- వామ్మో.. వేసక్టమా
- కు.ని.ఆపరేషన్లకు పురుషులు దూరం
- అమ్మకు తప్పని కడుపుకోత
- మూడేళ్లలో శస్త్రచికిత్స చేయించుకున్న తండ్రులు 109 మందే

గుంటూరు మెడికల్: దేనికైనా సరే మేము రెడీ అనే మగమహారాజులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు మాత్రం దూరం దూరం అంటున్నారు. వామ్మో.. వేసక్టమా అంటూ వెనకడుగు వేస్తున్నారు. ఫలితంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వల్ల మహిళలకు కడుపుకోత తప్పడంలేదు. మూడేళ్లుగా జిల్లాలో నమోదైన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. శస్త్రచికిత్సల కోసం పురుషులకు ఎంతో సులువైన పద్ధతులు వచ్చినా వారు ఆసక్తి చూడం లేదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో గత మూడేళ్లలో 20,396 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగాయి. వీటిల్లో మహిళలు 20,297 మంది ఆపరేషన్లు చేయించుకోగా పురుషులు 109 మంది మాత్రమే ఆపరేషన్లు చేయించుకున్నారు. ఏడాది మొత్తంలో ఆపరేషన్లు చేయించుకుంటున్న పురుషులు కనీసం 50 మంది కూడా ఉండటం లేదు. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా వేసెక్టమీ ఆపరేషన్ల విషయంలో మగవారికి అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సరైన చొరవ చూపటం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఆడవారే చేయించుకోవాలనే ధోరణి..!

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఆడవారే చేయించుకోవాలనే భావన నేటి ఆధునిక సమాజంలోనూ కొనసాగుతోంది. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. సంపాదనలో మగవారితో పోటీ పడుతున్నారు. ఇంటి ఎదుగుదలకు తమ వంతు కృషి చేస్తున్నారు. అక్కడ మహిళను గొప్పగా చూసే మగవారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల దగ్గరికి వచ్చే సరికి అది వాళ్ళ బాధ్యతే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మగవారికి చేసే శస్త్రచికిత్సలు సులువుగా ఉంటాయని తెలిసినా ఎవరూ ముందుకు రావటం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. చదువుకున్న పురుషులూ వేసెక్టమీ ఆపరేషన్లపై ఆసక్తి చూపించటం లేదు. మగవారు కు.ని. శస్త్రచికిత్సలు చేయించుకుంటే రకరకాల సమస్యలు వస్తాయనే మూఢత్వం ఇంకా జానాల్లో పేరుకుపోయి ఉంది. ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా వేసెక్టమీ ఆపరేషన్లపై అవగాహన కల్పించటంలో వైద్యాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు లేకపోలేదు.



వేసెక్టమీ ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

సిజేరియన్‌తో కలిపి చేస్తున్నారు

ఇప్పుడు చాలా మంది ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటున్నారు. కాన్పు కోసం వెళ్ళిన సమయంలో ఇక పిల్లలు వద్దనుకోగానే సిజేరియన్ చేసి దాంతోపాటుగా కు.ని. ఆపరేషన్ చేస్తున్నారు వైద్యులు. ఎక్కువ మంది వైద్యులు సాధారణ కాన్పుల కోసం వేచి చూడకుండా సిజేరియన్ డెలివరీలు చేస్తూ ఉండటంతో పనిలో పనిగా ఆడవారికి ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేస్తున్నారు. కొంత మంది సాధారణ కాన్పు జరిగినా మహిళలనే కు.ని. ఆపరేషన్లు చేయించుకోవాలని చెబుతున్నారే తప్ప పురుషులు చేయించుకోవటానికి ఏ మాత్రం ముందుకు రావటం లేదు.

సంవత్సరం	మొత్తం ఆపరేషన్లు	స్త్రీలు	పురుషులు
2021-22	10,405	10,376	29
2022-23	5,521	5467	54
2023-24	4,470	4,444	26

వేసెక్టమీ ఆపరేషన్లే సులువు



కుటుంబ నియంత్రణ కోసం మహిళలు చేయించుకునే ట్యూబెక్టమీ ఆపరేషన్ల కంటే పురుషులు చేయించుకునే వేసెక్టమీ ఆపరేషన్లు చాలా సులువుగా చేయవచ్చు. కేవలం మూడు నుంచి ఐదు నిమిషాల వ్యవధిలో ఆపరేషన్ చేస్తారు. కు.ని. ఆపరేషన్ చేయించుకునే పురుషులు ఒక్కరోజు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. స్త్రీలు ఆపరేషన్ చేయించుకుంటే వారం రోజులు విశ్రాంతి తీసుకోవాలి. పురుషులు వారం రోజులు బరువులు ఎత్తకూడదు. వారం రోజుల తర్వాత శృంగారంలో పాల్గొనవచ్చు. ఎలాంటి భయాలు లేకుండా పురుషులు వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకునేందుకు ముందుకు రావాలి.

డాక్టర్ మండవ శ్రీనివాసరావు, రిటైర్డ్ గైనకాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

టిడ్కో ఇళ్ల వద్ద తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

పైప్‌లైన్లను పరిశీలించిన కమిషనర్ నిర్మల్‌కుమార్

మంగళగిరి: స్థానిక ఆటోనగర్‌లోని వైఎస్సార్ జగనన్న కాలనీ(టిడ్కో) నివాసాలకు తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. శుక్రవారం తాగునీటి సమస్య తలెత్తడంతో వెంటనే కమిషనర్ టిడ్కో నివాసాలను సందర్శించి సమస్యను తెలుసుకుని పరిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మోటారు కాలిపోవడం వల్ల టిడ్కో నివాసాలకు తాగునీటి సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే ఇంజినీరింగ్ విభాగం వారితో మరమ్మతులు చేయించి నీరు సరఫరా చేశామన్నారు. అవసరమైతే కొత్త మోటారు కొని అమర్చుతామన్నారు. అనంతరం బ్లాక్‌ల వద్ద పైపులైను వాల్వ్‌లను పరిశీలించారు. ఏ బ్లాక్ వారు ఆ బ్లాక్‌లో వాల్వ్‌లను సొంతంగా ఆపరేట్ చేసుకుంటుండడంతో మిగిలిన బ్లాక్‌లకు సరిగా నీరు అందడం లేదన్నారు. ఈ సమస్య తలెత్తకుండా బ్లాక్‌ల వారీగా సమయం కేటాయించి నీటిని సరఫరా చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా శ్వాశత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో నివాసాల వద్ద స్థానికులను అడిగి సమస్య తెలుసుకుంటున్న కార్పోరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్

ఏపీ ఈసెట్‌లో ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్హతతో బీటెక్‌లోకి ప్రవేశం కల్పించే ఏపీ ఈసెట్ ఫలితాల్లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ బ్రాంచ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణమూర్తి మాట్లాడుతూ తమ విద్యార్థులు సీఎస్ఈ విభాగంలో పి.కార్తికేయ రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకు, పోట్ల అక్షయశ్రీ 194వ ర్యాంకు, మిర్యాల దీప్తిక 218వ ర్యాంకు, ఈసీఈ విభాగంలో కె.భావన 1006వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ విభాగం నుంచి 85 మంది విద్యార్థులు ఈసెట్‌కు హాజరు కాగా, వారిలో 83 మంది ర్యాంకులు కైవసం చేసుకోవడం గొప్ప విషయమన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి. ఐజాక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, విభాగాధిపతులు వి. రమాదేవి, చల్లా జ్యోతిర్మయి పాల్గొన్నారు.



విద్యార్థులతో చెరువు రామకృష్ణమూర్తి

రైతు వేషంలో వెళ్లి గుట్టురట్టు

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పత్తి, మిర్చి విత్తనాలను అక్రమంగా నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. రైతు వేషంలో హెడ్‌కానిస్టేబుల్‌ను పంపి గుట్టురట్టు చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు గుంటూరు రాజాగారితోటలోని కుబేరా సీడ్స్– పెస్టిసైడ్స్ దుకాణానికి హెడ్ కానిస్టేబుల్ పోలిరాజును రైతు వేషంలో విజిలెన్స్ అధికారులు పంపించారు. పత్తి, మిర్చి విత్తనాలైన సూపర్ బంటి, రేవంత్, యూఎస్ 7067 రకాలున్నాయా అని పోలిరాజు అడగ్గా, నిల్వల్లేవని దుకాణ యజమాని బదులిచ్చారు. దీంతో విజిలెన్స్ ఏఓ రమణ కుమార్, సీఐ శ్రీనివాసులరెడ్డి, స్థానిక ఏఓ అంజిరెడ్డి సిబ్బంది దుకాణంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించగా, ఆ మూడు రకాలు నిల్వల్లేవని నమోదు చేశారు. అయితే గిడ్డంగిలో మాత్రం రేవంత్ రకం విత్తనాలు 18 సంచులను అధికారులు గుర్తించారు. దుకాణదారుడు విత్తనాలు నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. రూ.15 వేలు విలువ చేసే విత్తనాలు సీజ్ చేశారు. దుకాణదారుడిపై 6–ఏ కేసు నమోదు చేయాలని స్థానిక ఏఓను ఆదేశించారు. బాలాజీ సీడ్స్ దుకాణంలో సోర్సు ధ్రువీకరణ పత్రం లేకుండా రూ.37 వేలు ఖరీదు చేసే హైబ్రిడ్ మిరప విత్తనాలను గుర్తించారు. దీంతో విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. శ్రీరామా సీడ్స్ దుకాణంలో సోర్సు ధ్రువీకరణ పత్రం లేకుండా విక్రయిస్తున్న రూ.1.63 లక్షల విలువ చేసే 200 సంచుల హైబ్రిడ్ మిరప విత్తనాలకు 'స్టాప్ సేల్'' నోటీసులు జారీచేశారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఏఓ, సీఐ తదితరులు

చికిత్స పొందుతూ మాజీ సైనికుడి మృతి

బాపట్ల టౌన్: చికిత్స పొందుతూ మాజీ సైనికుడు మృతి చెందిన ఘటన మండలంలోని బేతపూడిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కావూరి సుబ్రహ్మణ్యంరెడ్డి ఇటీవల చీరాల సమీపంలో హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి శుక్రవారం సైనిక సంక్షేమ సంఘం సభ్యులు జాతీయ జెండాను కప్పి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు, బాపట్ల మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, సీనియర్ మాజీ సైనికులు డి. వెంకటేశ్వర్లు, సీహెచ్‌వి. కృష్ణారావు, భక్కా రామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పోతురాజు రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, నంగు రాంప్రసాద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషురెడ్డి పాల్గొన్నారు.

రంగస్థల నటుడు కృష్ణేశ్వరరావుకు సత్కారం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై అక్కి రాజు ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావును సత్కరించారు. రచయిత, నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షత వహించారు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ స్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, సనాతన ధర్మ ప్రచారకులు యాబలూరి లోకనాథశర్మ, సంస్థ అధ్యక్షులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, కార్యదర్శి పంద్రప్రగడ శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్.మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, ప్రముఖ రంగస్థల నటుడు కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సుందరరామకృష్ణ భక్తి చింతామణి నాటకంలో బిల్వమంగళుడు ఏకపాత్రాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి సంగీత సహకారం అందించారు.



కృష్ణేశ్వరరావుని సత్కరిస్తున్న అతిథులు

భవిత పాఠశాలలకు ప్రభుత్వం పెద్దపీట

జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న

జంపని(వేమూరు): ప్రభుత్వం భవిత పాఠశాలలకు పెద్దపీట వేస్తోందని జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. మండలంలోని జంపనిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 0–18 ఏళ్ల లోపు పిల్లల్ని సర్వే చేస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీతో పాటు విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులు అందిస్తోందని, వాటిని తల్లిదండ్రులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లల్ని గుర్తించడానికి మే ఒకటో తేదీ నుంచి సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను పరిశీలిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో వి. మోహనరాజు, యస్. విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం

కత్తితో పొడిచిన భర్త

తెనాలి రూరల్: తెనాలి కొత్తపేటలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో శుక్రవారం సాయంత్రం దారుణం జరిగింది. ఓ నోటరీ కార్యాలయంలో డీటీపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న పులివర్తి మానసపై ఆమె భర్త చిల్లా రవి కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మానసను స్థానికులు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించగా భర్త రవిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ సీఐ దశరథరామారావు కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన చిల్లా రవికి వరుసకు మేనకోడలయ్యే పులివర్తి మానసతో 2017లో పెళ్లయింది. వీరికి పిల్లలు లేరు. ప్రస్తుతం రవి కూలి పనులు చేసుకుంటుండగా బీటెక్ చదివిన మానస తెనాలి కొత్తపేటలోని నోటరీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. రవి మద్యం తాగుతూ అనుమానంతోపాటు అదనపు కట్నం కోసం మానసను వేధిస్తుండేవాడు. దీనిపై మానస, ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కోర్టులో విచారణలో ఉంది. ప్రస్తుతం మానస తల్లి వద్దనే ఉంటూ రోజూ తెనాలి వచ్చి ఉద్యోగం చేసుకుని వెళుతోంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో భార్య పని చేసే డీటీపీ సెంటర్ వద్దకు వచ్చిన రవి ఆమెపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. మెడ, వీపు మీద మూడుచోట్ల కత్తితో పొడవడంతో మానస తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. రవిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మానస పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని తెలిసింది.



చికిత్స పొందుతున్న మానస

వీవీఐటీలో ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. వివిధ విద్యాసంస్థలకు చెందిన 632 మంది క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొని దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంచుకున్నారని, తొలిసారిగా ఏర్పాటు చేసిన సాహస విన్యాస పోటీలలో విద్యార్థులు ప్రదర్శించిన స్ఫూర్తి ప్రశంసనీయమని బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎఎస్ సుదర్శన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో క్యాడెట్లకు వ్యాయామం, పరుగు, యోగా, కవాతు ఆయుధాలపై అవగాహన, ఫైర్ ఫైటింగ్, సీపీఆర్, మ్యాప్ రీడింగ్, త్రివిధ దళాల అంశాలపై శిక్షణ ఇచ్చారు.. రోప్‌వే, కొండలు ఎక్కడం వంటి సాహస విన్యాసాలతోపాటు వాలీబాల్, ఖోఖో వంటి ఆటలలో పోటీలు నిర్వహించి పురస్కారాలు అందించారు. ముగింపు వేడుకలలో భాగంగా క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తిగీతాల నృత్యాలు అలరించాయి. పోటీలలో 25 మంది వీవీఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పురస్కారాలు దక్కించుకున్నారు. కార్యక్రమములో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన క్రీడాకారులతో గ్రామస్తులు, అధికారులు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. మండల పరిధిలోని పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నెల రోజుల నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ అనుమతితో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో పురుషుల ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి సుమారు 75 మంది బాలురు, పురుషులు పాల్గొన్నారు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ, గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో శిబిరం నిర్వహించినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పంగులూరు ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు క్రీడాకారులు ఉద్దేశించి మాట్లాడారు. వేసవిలో సమయాన్ని వృథా చేయక క్రీడా ప్రాధాన్యత ఇచ్చి బాలురకు, శిక్షణకు పంపిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె. పాల్‌కుమార్ మాట్లాడుతూ పంగులూరు అంటేనే ఖోఖో క్రీడ గుర్తుకు వస్తుందన్నారు. 252 క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శిక్షణకు పూర్వ క్రీడాకారులు బొప్పూడి హరిబాబు (యూఎస్‌ఏ), ఐ. సోమశేఖర్‌రెడ్డి (గ్రామ సచివాలయం), శ్రీనివాసరెడ్డి (పీఈటీ), మేకా వెంకటేశ్వర్లు (పీఈటీ), కుక్కపల్లి వెంకట్రావు (సీఐ) రూ. 25 వేలు ఆర్థిక సాయం చేశారు. మిగిలిన ఖర్చులు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ అందించినట్లు తెలిపారు. ఎస్ఆర్ స్పోర్ట్స్ తరఫున 45 మందికి క్రీడా దుస్తుల్ని నల్లమపు శ్రీరాములురెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె ఉషారాణి (అడ్వకేట్) బహూకరించారు. వారికి క్రీడాకారులు కృతజ్ఞలు తెలిపారు. క్రీడాకారులకు బాపట్ల కోచ్ జొన్నలగడ్డ పాల్ (డీఎస్‌ఏ) శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంగులూరు కళాశాల మాజీ అంతర్జాతీయ క్రీడాకారుడు భవనం కాశీవిశ్వనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీల, వెంకట సుబ్బారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శింగరకొండ ఆలయంలో అధునాతన వంటశాల ప్రారంభం

స్టీమ్ పరికరాలు అందించిన ఎస్‌బీఐ

అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి భోజనశాల ఆధునికతను సంతరించుకుంది. సీఎస్సార్ యాక్టివిటీ కింద అద్దంకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ స్టీమ్ పరికరాలు అందజేసింది. ఆధునిక వంటశాలను శుక్రవారం స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుగుణేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి టి. సుభద్ర మాట్లాడుతూ దేవదాయశాఖ ఆదేశాల మేరకు ప్రస్తుతం శింగరకొండలో శని, మంగళవారాల్లో రోజుకు 500 మందికి, విడి రోజుల్లో 150 నుంచి 200 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎక్కువ మందికి చేయాల్సి వస్తే ఈ స్టీమ్ కుక్కర్లు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. ఎస్‌బీఐ అందజేసిన ఐదు కుక్కర్లలో ఒక్కో దానిలో 25 కిలోల బియ్యం 15 నుంచి 20 నిముషాల్లో అన్నంగా తయారవుతుందని వివరించారు. మూడు కుక్కర్ల సాయంతో 75 కిలోల బియ్యాన్ని అన్నంగా తయారు చేసుకోవచ్చని తెలిపారు. మిగిలిన రెండింటినీ కూరలు తయారు చేసుకోవడానికి వినియోగించనున్నట్లు ఆయన వెల్లడించారు. 20 నిముషాల్లో 500 మందికి అన్నదానం చేయగలిగిన కిచెన్ పరికరాలను అడగ్గానే అందజేసిన స్టేట్‌బ్యాంకు యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



వంటశాలను ప్రారంభిస్తున్న స్టేట్ బ్యాంకు జనరల్ మేనేజర్ సుగుణేశ్వరరావు